క్లుప్తంగా

పేకాట శిబిరంపై దాడి: ఎనిమిది మంది అరెస్ట్


నిందితులతో గొల్లపాలెం పోలీసులు

కాజులూరు: గొల్లపాలెంలోని పేకాట శిబిరాలపై శనివారం దాడులు చేసి ఎనిమిది మందిని అరెస్టు చేసినట్టు గొల్లపాలెం ఎస్‌ఐ ఎం.మోహన్‌కుమార్ తెలిపారు. స్థానికుల నుంచి అందిన సమాచారం మేరకు గ్రామ సమీపంలో తమ సిబ్బందితో దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో ఎనిమిది మందిని అదుపులోనికి తీసుకుని వారి నుంచి రూ.7,400 నగదు స్వాధీనం చేసుకొని, అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్టు తెలిపారు.

రహదారుల ప్రారంభం


ద్రాక్షారామలో సీసీ రోడ్లు ప్రారంభించిన మంత్రి సుభాష్

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామంలో ఇటీవల నిర్మించిన రెండు సీసీ రోడ్లు, ఒక గ్రావెల్ రోడ్డులను రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ శనివారం కొబ్బరి కాయలు కొట్టి ప్రారంభించారు. అనంతరం ద్రాక్షారామం గ్రామ సచివాలయం వద్ద నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర–స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొని పారిశుధ్య కార్మికులను సత్కరించారు. సర్పంచ్ కొత్తపల్లి అరుణ, ఎంపీటీసీ నున్న సత్యవతి, ఎంపీడీవో కడలి పద్మజ్యోతి, ఈఓపీఆర్డీ ఎస్. సెలత్‌రాజు, పీఆర్ ఏఈ యేసురత్నం, పంచాయతీ కార్యదర్శి పెట్టా సత్యనారాయణ, సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభం


లొల్లలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

రాయవరం: మండలంలోని లొల్ల గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు శనివారం ప్రారంభించారు. గ్రామంలో రూ.45.90 లక్షలతో నిర్మించిన జల్‌జీవన్ మిషన్, రూ.12.90 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, రూ.8 లక్షలతో నిర్మించిన చెత్త నుంచి సంపద కేంద్రాన్ని ఎమ్మెల్యే జోగేశ్వరరావు ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ చాట్రాతి జానకిరాంబాబు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, రామచంద్రపురం వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ నల్లమిల్లి సత్యనారాయణరెడ్డి, ఎంపీటీసీలు వైట్ల సతీష్, వుండవిల్లి సుబ్బారాయుడు, తహసీల్దారు ఐపీ శెట్టి, ఎంపీడీవో ఎస్.కీర్తిస్పందన తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం


రామచంద్రపురంలో బాటసారులకు మజ్జిగ అందజేస్తున్న వికాస్ రమణ

రామచంద్రపురం: పట్టణంలోని ప్రధాన రహదారిలో మాతంగి సెంటర్ వద్ద వికాస్ విద్యా సంస్థల అధినేత, లయన్స్ క్లబ్ వికాస్ ప్రెసిడెంట్ వాసంశెట్టి వెంకట రమణ ఆధ్వర్యంలో శనివారం చలివేంద్రం ప్రారంభించారు. మొదటి రోజు బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

దారి కాచి బంగారు గొలుసు చోరీ చేసిన హిజ్రాలు

పి.గన్నవరం: మోటారు సైకిలుపై వస్తున్న ఒక వ్యక్తిని నలుగురు హిజ్రాలు ఆపి అతని మెడలోని బంగారు గొలుసు చోరీ చేసిన ఘటనపై శనివారం రాత్రి కేసు నమోదు చేసినట్టు ఎస్సై బి.శివకృష్ణ తెలిపారు. గత నెల 26న మండలంలోని బూరుగులంకకు చెందిన అడ్డాల నరసన్న పెట్రోలు కోసం తన మోటారు సైకిలుపై బెల్లంపూడిలోని బంకు వద్దకు వస్తున్నాడు. దారిలో చింతావారిపేట వద్ద అతడిని నలుగురు హిజ్రాలు ఆపారు. అతని మెడలోని సుమారు రెండు కాసుల బంగారు గొలుసు లాక్కుని, కారులో పరారయ్యారు. దీంతో బెంగ పెట్టుకున్న నరసన్న ఈ విషయం ఎవరికీ చెప్పలేదు. దిగాలుగా ఉన్న అతడిని స్థానికులు ప్రశ్నించే సరికి అసలు విషయం చెప్పాడు. దీంతో స్థానికుల సాయంతో అతడు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై శివకృష్ణ వివరించారు.

భూమికి సారం.. వారికి జీవనాధారం

- పంట పొలాల్లో మందలు కడుతున్న కాపరులు
- సేంద్రియ ఎరువుగా గొర్రెలు, మేకలు, బాతుల వ్యర్థాలు
- భూసారం పెంచేందుకు రైతుల ఆసక్తి


పంట పొలాల్లో మేత మేస్తున్న మేకలు, గొర్రెల మందలు

రాయవరం: మోతాదుకు మించి ఎరువులు, పురుగు మందుల వినియోగంతో భూసారం తగ్గిపోతుంది. ఇలాంటి చర్యలు భవిష్యత్ తరాలకు ప్రతికూలంగా మారుతాయని వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు పలు సందర్భాల్లో రైతులకు అవగాహన కలిగిస్తూ వస్తున్నారు. దీంతో రైతుల ఆలోచనా విధానంలో మార్పు వస్తోంది. దీంతో పాత సంప్రదాయ పద్ధతుల్లోనే భూసారం పెంచేందుకు రైతులు ఆసక్తి కనబర్చుతున్నారు. ఇందులో ఆవులు, గేదెలతో పాటుగా, గొర్రెలు, మేకల మందలు. పంట పొలాల్లో మందలను కాపు కాయటం, చెరువు పూడిక మట్టిని పొలాల్లో వేయటం, పశువుల పెంట వేసుకోవటం, పచ్చిరొట్టసాగు వంటి పద్ధతులు పాటించడం వంటివి చేస్తున్నారు.

వలస వచ్చిన మందలు

ప్రస్తుతం పంట పొలాల్లో గొర్రెలు, మేకల మందలను కడుతున్నారు. జీవాల మందలను కాపు కాయటంతో భూమికి సారంతో పాటు పెంపకందారులకు ఆదాయమార్గంగా ఉంటుంది. రబీ వరి కోతలు పూర్తయిన పంట పొలాల్లో మందలను కడుతున్నారు. పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల నుంచి గొర్రెలు, మేకల మందల కాపు కాసేవారు జిల్లాకు చేరుకోగా, నెల్లూరు, ప్రకాశం, గుంటూరు జిల్లాల నుంచి బాతుల మందలను తీసుకుని జిల్లాకు వచ్చారు. వీరంతా జిల్లా నలుమూలలకు మందలను తీసుకుని వచ్చారు. మందలు జిల్లాకు రావడం వలన ఉభయతారకంగా ఉంటుంది. మందల కాపరులకు వారి జీవాలకు మేత దొరుకుతుంటే.. రైతులకు వారి పంట పొలాల్లో మందల వ్యర్థాలతో సేంద్రియ ఎరువు లభ్యమవుతుంది.

తక్కువ ఖర్చుతో

పగలంతా చుట్టుపక్కల ప్రాంతాల్లో మేత మేసిన గొర్రెలు, మేకల మందలను రాత్రికి ఏదో ఒక రైతు పొలంలో మంద కడతారు. మందలను రాత్రంతా పొలంలో ఉంచడం వలన అవి విసర్జించే మలమూత్రాలతో భూసారం పెరుగుతుంది. గతంలో మందలు కట్టిన కాపరులకు రైతులు కొంత సొమ్మును ఇచ్చేవారు. మరికొందరు రైతులు మందలు కాసే కాపరులకు వారి ఆహారం నిమిత్తం బియ్యం, కూరగాయలు, పప్పులు తదితర సామగ్రిని ఇచ్చేవారు. ఇప్పుడా పరిస్థితి లేదని గొర్రెల కాపరులు చెబుతున్నారు. ఎకరం పొలంలో నాలుగైదు రాత్రులు మందల కాపు కాయడం వలన భూసారం బాగా పెరుగుతుంది. తద్వారా ఎరువుల ఖర్చు కూడా రైతుకు తగ్గుతుంది. పంట సమయంలో ఎరువులు, పురుగుల మందుల ఖర్చు సగానికి తగ్గిపోతుంది. పురుగుల మందు, ఎరువుల అవశేషాల్లేని పంట దిగుబడులను సాధించే వీలుంటుంది.

వేసవిలో అనుకూలం

పశువులు, గొర్రెలు, మేకల మందలను పంట పొలంలో కట్టేందుకు వేసవి అనుకూలం. ఖరీఫ్ తరువాత రబీలో రైతులు ఆరుతడి పంటలు, వాణిజ్య పంటలు వేస్తుంటారు. పంట కోత తరువాత మందలు కాపు కాస్తారు. వేసవి వర్షాలు పడినప్పుడు పొలం దుక్కి చేస్తారు. ఆ సమయంలో పశువులు, గొర్రెలు, మేకల వ్యర్థాలను భూమిలో కలియదున్నడం వలన అవి భూమిలో కలసి భూసారాన్ని పెంచుతాయి. పశువులు, జీవాల వ్యర్థాలు సేంద్రియ ఎరువుగా ఉపయోగపడతాయి. అయితే గతంలో మాదిరిగా పశువులను పొలాల్లో మంద కట్టడం తగ్గింది. కుక్కల బెడద, పశువుల దొంగిలించే అవకాశం ఉండడంతో రైతులు పంట పొలాల్లో పశువులను మంద కట్టేందుకు వెనకడుగు వేస్తున్నారు.

తాతతండ్రుల నుంచి



రబీ అనంతరం పంట పొలాల్లో పశువులను మందలు కట్టడం తాత, తండ్రుల నుంచి వస్తుంది. ప్రస్తుతం గొర్రెలు, మేకల మందలను పంట పొలాల్లో కడుతున్నాం. జీవాల మలమూత్రాల వలన భూమికి సారవంతంగా మారుతుంది. అలాగే పశువుల పెంటను కూడా వినియోగిస్తున్నాం. దీని వలన ఖరీఫ్‌లో ఎరువుల వాడకం తగ్గుతుంది.

– మేకా రామకృష్ణచౌదరి, రైతు, కుర్మాపురం, రాయవరం మండలం

భూసారం పెరుగుతుంది



పొలంలో గొర్రెలు, మేకల మందలను కాపు కాయడం వలన భూసారం బాగా పెరుగుతుంది. భూమి పొరల్లో ఉండే మిత్ర పురుగుల సంఖ్య పెరుగుతుంది. పంట దిగుబడుల్లో బడుల్లో ఎరువులు, పురుగు మందుల ప్రభావం లేకుండా ఉంటుంది.

– కొప్పిశెట్టి ప్రభాకర్, ఏవో, రాయవరం.

30వ రోజుకు చేరుకున్న మహిళ రిలే దీక్ష


కేశవరంలో 30వ రోజు దీక్ష చేస్తున్న వల్లూరి శ్రీవాణి

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం డి.కేశవరంలో పాఠశాలకు రక్షణ గోడ నిర్మించాలంటూ గ్రామానికి చెందిన మహిళ వల్లూరి శ్రీవాణి చేస్తోన్న రిలే నిరాహార దీక్ష శనివారంతో 30వ రోజుకు చేరుకుంది. మండపేట మండలంలో మేజర్ పంచాయతీగా ఉన్న కేశవరంలో ఒక మహిళ చేస్తున్న ఆందోళనకు అటు అధికారులు కానీ, రాజకీయ నాయకులు గానీ స్పందించకపోవడం నియోజకవర్గ ప్రజలను ఆశ్చర్యపరుస్తోంది. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా నెల రోజుల నుంచి ఒంటరిగా మహిళ చేస్తున్న రిలే దీక్ష పట్ల నియోజకవర్గ ప్రజాప్రతినిధులు ఎందుకు స్పందించడం లేదన్నది అర్థం కావడం లేదని ప్రజలు వాపోతున్నారు. సమస్య ఒక వ్యక్తిదో, కుటుంబానిదో కాదు. గ్రామంలోని ఉన్నత పాఠశాలకు ప్రహరీని నిర్మించమంటూ చేస్తున్న దీక్ష అది. గోడ నిర్మాణానికి ఓఎన్జీసీ నుంచి నిధుల మంజూరుకు అవకాశముందని దీక్ష చేస్తోన్న మహిళ చెబుతున్నారు. విద్యా సంవత్సరం ఆరంభం లోపు ప్రహరీ నిర్మించడం పాఠశాల నిర్వహణకు ప్రయోజనకరంగా ఉంటుందని దీక్ష చేస్తున్న శ్రీవాణి చెబుతున్నారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం


పసలపూడిలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు

రాయవరం: మండలంలోని పసలపూడిలో ఈ నెల 13 నుంచి ప్రారంభమైన వేసవి శిక్షణ శిబిరం శనివారంతో ముగిసింది. యూటీఎఫ్, సీఐటీయూ తదితర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆరు నుంచి 14 సంవత్సరాల బాలబాలికలకు వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. శిక్షణలో విద్యార్థులకు మంచి అలవాట్లు, స్పోర్ట్స్ అండ్ గేమ్స్, డ్రాయింగ్, క్రాఫ్ట్, పాటలు పాడడం, డ్యాన్స్, గణితం పజిల్స్ తదితర అంశాల్లో శిక్షణ ఇచ్చారు. రామచంద్రపురం రేవతి సైన్స్ ఫౌండేషన్ నిర్వాహకుడు కె.శ్రీకృష్ణసాయి విద్యార్థులకు సైన్స్ ప్రయోగాలపై అవగాహన కల్పించారు. వేసవి శిక్షణ శిబిరంలో ప్రతిభ కనబర్చిన బాలబాలికలకు బహుమతులు అందజేశారు. శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు కడలి శ్రీనివాసరావు, సీఐటీయూ మండల శాఖ అధ్యక్షురాలు డి.ఆదిలక్ష్మి, ఉపాధ్యాయులు జి.మురళీకృష్ణ, వెత్సా గోపికృష్ణ, కిలపర్తి శ్రీనివాసరావు, సీఐటీయూ నేతలు సీహెచ్ సత్యవేణి, ఎస్.శ్రీసత్య తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ ప్రాధాన్యం తెలిపే పుస్తకం ఆవిష్కరణ


మండపేట గ్రంథాలయంలో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

కపిలేశ్వరపురం (మండపేట): ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పునర్వికాస వేదిక ఆధ్వర్యంలో ముద్రించిన 'గ్రంథాలయ విజ్ఞాన సర్వస్వం వ్యాస సంకలనం' పుస్తకాన్ని మండపేట గ్రంథాలయంలో శనివారం ఆవిష్కరించారు. వేదిక జిల్లా కన్వీనర్ మాతా చినబాబు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో తొలి ప్రతిని గ్రంథాలయాధికారిణి ఎస్.పూర్ణమ్మకు అందజేశారు. అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జిల్లా అధ్యక్షుడు గండి స్వామి ప్రసాద్ మాట్లాడుతూ ఆధునిక కాలంలో సైతం పుస్తక పఠనం ఆసక్తి అభ్యుదయ వర్గాల్లో పుష్కలంగా ఉందన్నారు. కన్వీనర్ చినబాబు మాట్లాడుతూ స్వాతంత్య్ర ఉద్యమ కాలంలో ప్రారంభమైన గ్రంథాలయాలు, ప్రజా జీవనంలో పౌర గ్రంథాలయాలు, గ్రంథాలయ చట్టాలు, గ్రంథాలయ సమాచార శాస్త్రం, సాహిత్య పఠనం తదితర అంశాలపై పలువురు రాసిన వ్యాసాలను 'గ్రంథాలయ విజ్ఞాన సర్వస్వం వ్యాస సంకలనం' పుస్తకంలో పొందుపర్చామన్నారు.

గ్రేడ్‌-2 పంచాయతీగా పరిగణించాలని వినతి


ద్రాక్షారామలో మంత్రి సుభాష్‌కు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్ సతీష్‌రావు

రామచంద్రపురం రూరల్: మండలంలోని హసన్‌బాద పంచాయతీని గ్రేడ్‌–2 పంచాయతీగా పరిగణించేలా చర్యలు తీసుకోవాలని సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు శనివారం రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్‌ని ద్రాక్షారామలో కలసి వినతిపత్రం అందజేశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం 2011 జనాభా లెక్కల ప్రకారం పంచాయతీలను పునర్విభజన చేస్తున్న సందర్భంగా హసన్‌బాద గ్రామ జనాభా 2011 లెక్కల ప్రకారం 1973 ఉందన్నారు. కేవలం 27 మంది జనాభా తగ్గిన కారణంగా గ్రేడ్‌–3 గా ఉండిపోతే గ్రేడ్‌–2 పంచాయతీలకు అందించే సదుపాయాలను కోల్పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరోగ్య సర్వే ప్రకారం చూస్తే జనాభా 2 వేలకు పైగానే ఉంటుందన్నారు. పంచాయతీ కార్యదర్శి కాశి రాకేశ్‌కుమార్ పాల్గొన్నారు.

చైన్ స్నాచింగ్‌పై కేసు

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెంకటాయపాలెంలో శుక్రవారం రాత్రి చైన్ స్నాచింగ్ సంఘటన చోటుచేసుకుంది. ద్రాక్షారామ ఎస్ఐ ఎం.లక్ష్మణ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కె.గంగవరం మండలం కుందూరు గ్రామానికి చెందిన మేడిశెట్టి రేఖ తన అత్తతో స్కూటీపై ద్రాక్షారామ వచ్చారు. తిరిగి రాత్రి 7.30 గంటల సమయంలో ఇంటికి వెళ్తుండగా వెంకటాయపాలెం దాసరిపాడు ఆంజనేయస్వామి ఆలయం వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి మోటారు సైకిల్‌పై వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి మెడలోని సుమారు 1.95 లక్షలు విలువ గల 39 గ్రాముల బంగారు గొలుసు లాక్కుని వెళ్లిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు.

పశువుల నీటి తొట్టెల పరిశీలన


ద్వారపూడిలో పశువుల తొట్టెను పరిశీలిస్తున్న ఎంపీడీఓ తదితరులు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం ద్వారపూడిలో ఏర్పాటు చేసిన పశువుల నీటి తొట్టెలను ఎంపీడీఓ కె.సత్యనారాయణ, డిప్యూటీ ఎంపీడీఓ దాసరి శ్రీనివాస్ పరిశీలించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వేసవిలో పశువుల దాహార్తిని తీర్చేందుకు పశు సంవర్ధక శాఖతో పాటు అనుబంధ శాఖల సహకారంతో ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని ఎంపీడీఓ తెలిపారు.

ఉపాధ్యాయులకు నేడు ఆఫ్‌లైన్ శిక్షణ

రాయవరం: ఇంగ్లిష్‌పై ప్రభుత్వ ఉపాధ్యాయులు పట్టు సాధించేందుకు 40 రోజుల ఉచిత ఆన్‌లైన్ శిక్షణను రంగారెడ్డి జిల్లా నందిగాంకు చెందిన ఎ.రామేశ్వర్‌గౌడ్ ఇస్తున్నారు. ఏప్రిల్ 26 నుంచి ప్రారంభమైన ఆన్‌లైన్ శిక్షణలో జిల్లాకు చెందిన సుమారు 600 మంది ఉపాధ్యాయులు పాల్గొంటున్నారు. శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులకు ఆదివారం ఓడలరేవు బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో ఒక రోజు ఆఫ్‌లైన్ శిక్షణ ఉంటుంది. జిల్లా విద్యాశాఖ సహకారంతో జిల్లాలో ఉన్న ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ తరగతులకు ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేశారు. రామేశ్వర్‌గౌడ్ సొంత ఖర్చుతో జూమ్ మీటింగ్ ద్వారా ఉపాధ్యాయులకు ఆన్‌లైన్‌లో ఇంగ్లిష్ క్లాసులు నిర్వహిస్తున్నారు. 40 రోజుల కోర్సులో భాగంగా ఒక రోజు వర్చువల్ క్లాస్‌ను నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయులతో నేరుగా మాట్లాడుతూ వారి సందేహాలను నివృత్తి చేసేందుకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అల్లవరం మండలం ఓడలరేవు బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు ఆఫ్‌లైన్‌లో తరగతిని నిర్వహిస్తున్నారు.

జాతరలు మానవ జీవన విధానానికి ప్రతీక


గ్రామ పెద్దలతో కలసి జాతరను వీక్షిస్తున్న ఎమ్మెల్సీ తోట


అమ్మవారి వేషధారణ ప్రదర్శనను వీక్షిస్తున్న గ్రామస్తులు

కపిలేశ్వరపురం: దేవతల జాతరలు మానవ జీవన విధానానికి ప్రతీక అని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. వెదురుమూడి దళితవాడలోని కుంతీదేవి ఆలయాన్ని ఎమ్మెల్సీ తోట సందర్శించి పూజలు చేశారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం దళిత సామాజిక పెద్దలతో కలసి జాతరను వీక్షించారు. 16 ఏళ్ల తర్వాత గ్రామంలోని దళితవాడ పెద్దల పర్యవేక్షణలో రెండోరోజు జాతర వైభవంగా సాగింది. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. రెండో రోజు జాతర గ్రామ వీధుల్లో కోలాహలంగా సాగింది. డప్పు వాయిద్యాలు, కేరళ వాయిద్య నృత్యాలు, బుట్టబొమ్మలు, పొడుగు మనిషి విశేషంగా ఆకట్టుకున్నాయి. మాల సామాజికవర్గీయుల ప్రత్యేక కళ గారడీ నృత్యాలతో గ్రామ వీధులు మారు మ్రోగాయి. దళిత సామాజిక వర్గీయుల శ్రమ కావ్యాలను ఆలపిస్తూ నృత్యతాండవం చేశారు. గ్రామంతో పాటు నియోజకవర్గంలోని పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకొని జాతర వీక్షించారు.

సమస్యలు పరిష్కరించాలని ఆందోళన


మున్సిపల్ కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న సిబ్బంది

రామచంద్రపురం: ఈ నెల 19 నుంచి పూర్తిగా విధులను బహిష్కరించి సమ్మెబాట పడుతున్నట్లు రామచంద్రపురం మున్సిపాలిటీలో ఇంజినీరింగ్ విభాగంలో అవుట్ సోర్సింగ్ సిబ్బంది శనివారం మున్సిపల్ కమిషనర్‌కు నోటీసు అందజేశారు. అరకొర జీతాలు, సెలవులతో పాటు వయస్సు పెంపుదల తదితర అంశాలపై రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు ఈ నిర్ణయం తీసకున్నట్లు వారు తెలిపారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం ముందు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నినాదాలు చేశారు.

గ్రామాల్లో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర


మండపేట పట్టణ వీధుల్లో అవగాహన ర్యాలీ చేస్తున్న కమిషనర్ రంగారావు, మున్సిపల్ ఉద్యోగులు

కపిలేశ్వరపురం: మండలంలోని గ్రామాల్లో శనివారం 'స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా చెత్త తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. మండల ప్రత్యేకాధికారి ఎస్‌టీవీ రాజేంద్ర ప్రసాద్, ఎంపీడీఓ జి.రాజేంద్రప్రసాద్, డిప్యూటీ ఎంపీడీఓ ఆర్‌ఎంవీవీఎస్ ఈశ్వరరావు 19 గ్రామాల్లోని పారిశుధ్య అవగాహన కార్యక్రమాలను పర్యవేక్షించారు. అంగర గాంధీ సెంటర్‌లో మానవహారం నిర్వహించిన పారిశుధ్య పరిరక్షణ ప్రాధాన్యతను చాటుతూ నినాదాలు చేశారు.

మండపేటలో..

మండపేట పట్టణంలో 'స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమాలను చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు పర్యవేక్షణలో పట్టణ వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వేసవి నేపథ్యంతో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యాధికారులు పట్టణ ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్యాధికారులు రమ్యలక్ష్మి, మెడికల్ సూపర్‌వైజర్లు ఎస్.అనంతలక్ష్మి, రెవెన్యూ ఆఫీసర్ జేవీఎస్ శాస్త్రి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.సత్తిరాజు, ఏఈలు డి.పవన్‌కుమార్, బి.ఆంజనేయులు ఆర్ఐ ఏజేఎన్ శ్రీనివాస్, మెప్మా సీఎంఎం పి.సుజాత పాల్గొన్నారు. మండపేట రూరల్ మండలంలోని 12 గ్రామాల్లో 'స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర' కార్యక్రమాన్ని నిర్వహించారు.

విద్యుత్ సబ్ స్టేషన్ పరిసరాలు శుభ్రం..

మండపేటలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఏఈ ఎం.మునియ్య ఆధ్వర్యంలో 'స్వర్ణాంధ్ర, స్వచ్ఛ దివస్' కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యాలయ ఆవరణలో నిరుపయోగంగా ఉన్న పరికరాలు, వ్యర్థాలను తొలగించారు. విద్యుత్ లైన్ల వెంబడి తుప్పలను తొలగించారు. కార్యక్రమంలో సబ్ స్టేషన్ జేఈ వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.


మండపేట 20 వార్డులో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

పారిశుధ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యం

కపిలేశ్వరపురం (మండపేట): పారిశుధ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు మండపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి తెలిపారు. పట్టణంలోని 20 వార్డులో శనివారం చేపట్టిన పారిశుధ్య చర్యలను ఆమె పర్యవేక్షించారు. టిడ్కో ఇళ్ల పరిసరాల్లో చేపట్టిన పనులను పరిశీలించి సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ఆమె వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.సత్తిరాజు, టిడ్కో ఏఈ వివేక్, కౌన్సిలర్ మందపల్లి రవికుమార్, శానిటరీ మేస్త్రి మహేష్, సచివాలయ కార్యదర్శి సురేష్ ఉన్నారు.

తాటి ముంజెలకు భలే గిరాకీ

- హాట్ కేక్‌ల్లా అమ్ముడుపోతున్న దృశ్యం



ముంజెలు విక్రయిస్తున్న వ్యాపారి. అమ్మకానికి సిద్ధంగా ముంజెలు (అంతర చిత్రం)

రాయవరం: వేసవిలో దాహార్తిని తీర్చే తాటి ముంజెలకు గిరాకీ పెరిగింది. వేసవి తాపాన్ని తీర్చి, చల్లదనం కలిగించడంతో పాటుగా, ఆరోగ్యాన్నిచ్చే తాటి ముంజెలను ఎక్కువగా ఇష్టపడుతున్నారు. గత కొన్నేళ్లుగా తాటి ముంజెలకు గిరాకీ పెరగడంతో సీజనల్ వ్యాపారాలు చేసే వారు తాటి ముంజెలను విక్రయించేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. దాహార్తిని తీర్చే తాటి ముంజెలను చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అన్ని వయస్సుల వారు ఇష్టపడుతున్నారు.

పలువురు వేసవిలో తాటి ముంజెలను అమ్ముకుంటూ ఉపాధి పొందుతున్నారు. ఈ ప్రాంతంలో ఉన్న వారితో పాటుగా, బిక్కవోలు, రంగంపేట, అనపర్తి మండలాలకు చెందిన చిరు వ్యాపారులు ఈ ప్రాంతంలో తాటిముంజెల విక్రయాలు చేపడుతున్నారు. తాటి చెట్లను రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసే వ్యాపారులు సీజన్‌లో తాటి ముంజెల వ్యాపారం చేస్తున్నారు. ఫిబ్రవరి, మార్చి నెలలో డజను తాటి ముంజెలను రూ.80 నుంచి రూ.100 వరకు విక్రయిస్తుండగా, ప్రస్తుతం రూ.50లకు విక్రయాలు చేస్తున్నారు. ధర తగ్గడంతో ప్రతి ఒక్కరూ తాటి ముంజులను కొనుగోలు చేస్తున్నారు. ఏటా వేసవిలో ముంజెల వ్యాపారం చేస్తుంటానని సత్తిబాబు తెలిపాడు.

మండపేటలో నేడు తిరంగా యాత్ర

కపిలేశ్వరపురం (మండపేట): దేశ ప్రజలంతా సైనికుల వెంట ఉన్నామంటూ చాటి చెప్పేందుకు మండపేట పట్టణంలో ఆదివారం తిరంగా యాత్రను నిర్వహించనున్నట్టు బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కేవీవీ సాయిరామ్ తెలిపారు. భారత్‌-పాక్ సరిహద్దులో యుద్ధ వాతావరణం నేపథ్యంలో ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన నేపథ్యంలో కుల, మత, రాజకీయాలకు అతీతంగా ఐక్యతను చాటి చెప్పే లక్ష్యంతో యాత్ర చేయనున్నట్టు సాయిరామ్ తెలిపారు.